ప్రజాశక్తి

గురువారం 4 సెప్టెంబర్ 2025





పోలా రామాంజినేయులుకు నివాళి అర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

పోలా రామాంజినేయులు

ఆశయాలను కొనసాగిస్తాం

వర్ధంతి కార్యక్రమంలో నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

చేనేత కార్మికులు, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం సాగించిన పోలా రామాంజినేయులు ఆశయాలను కొనసాగించేలా ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కామ్రేడ్ పోలా రామాంజనేయులు రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో బుధవారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్.బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలా రామాంజనేయులు చేనేత పరిశ్రమ, చేనేత కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం సాగించారన్నారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా కృషి చేశారన్నారు. చేనేత పట్టు పరిశ్రమను కాపాడేందుకు అనేక రకాల ఉద్యమాలను నిర్వహించారని గుర్తు చేశారు. 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, ప్రతి కార్మికునికి సబ్సిడీ అందించాలని, ప్రత్యేక బ్యాంకును ఏర్పాటు చేయాలని, కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని, ప్రభుత్వం నుంచి ప్రతి సంవత్సరం రూ.24 వేల ఆర్థికసాక సాయం అందించాలని కోరుతూ ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డిని ప్రత్యక్షంగా కలిసి కార్మికులకు సహాయ సహకారాలు అందించాలని కోరారన్నారు. పోల రామాంజనేయులు ఆశయాల సాధన కోసం ఆయన పోరాటాలకు పునరంకితం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎ.మారుతి, సిఐటియు నాయకులు జెవి.రమణ, టి.అయూబ్ ఖాన్, ఎల్..ఆదినారాయణ, ఎస్.హైదర్ వలీ, జెవివి జిల్లా కార్యదర్శి లోకేష్, ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు గుంపు హరి, ఎ.ఖాదర్ బాషా, వి.వెంకటస్వామి, అన్నం సూరి, పులిచెర్ల హరి, చౌడయ్య, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఎం.బాబు, ముకుంద, ఓబులేసు, వెంకటరాముడు, ఎల్.ఆదినారాయణ, పాల్గొన్నారు.

ధరాభారం.. కల్తీ భయం..!



ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలు... అధికారుల ఉదాసీనతకారణంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనికి తోడు ఏ వస్తువు కొన్నా అది కాస్తా కల్తీ మయంగా మారింది. ఒక పక్క ధరాఘాతం... మరో పక్క కల్తీతో పేద, మధ్య తరగతి కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. ఎప్పటికప్పుడు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాగం కాస్తా మాముళ్ల మత్తులో తూగుతోంది. వ్యాపారులు చెప్పిందే ధర... ఇచ్చిందే సరుకు అన్న చందంగా తయారైంది.

- ఒక పక్క ధరాఘాతం.... మరో పక్క కల్తీ..
- విలవిల్లాడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు
- కల్తీ పదార్థాలు తిని అనారోగ్యం పాలు
- ప్రేక్షక పాత్రలో అధికారులు



ప్రజాశక్తి-హిందూపురం

గతంలో ఎన్నడూ లేనివిధంగా నిత్యావస సరుకుల ధరలు భారీగా పెరిగిపోవటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిల్లాడుతున్నారు. కిలో కందిపప్పు రూ.140 నుంచి రూ.180కు చేరింది. ఎండు మిర్చి రూ.180 నుంచి రూ.220, చింతపండు రూ.110 నుంచి రూ.180, శనగ పప్పు రూ.110 నుంచి రూ.130, పెసలు రూ.120 నుంచి రూ.140, మినుములు రూ.110 నుంచి రూ.125, వేరుశనగ నూనె రూ.160 నుంచి రూ.170, ధనియాలు రూ.110 నుంచి రూ.120, నువ్వులు రూ.160 నుంచి రూ.170, పామాయిల్ రూ.110 నుంచి రూ.140, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.130 నుంచి రూ.150ల చొప్పున ధరలు పెరిగాయి. మరోవైపు కూరగాయలు కొండెక్కి కూర్చున్నాయి. వరదలు, వర్షాలు కారణంగా డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేకపోవటంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. కేజీ టమోటా రూ.50కి చేరింది. గత నెలలో రూ.30 చొప్పున విక్రయాలు జరిగాయి. వంకాయలు కేజీ రూ.40 నుంచి రూ.60కి చేరాయి. బెండకాయలు, కాకర, బీరకాయలు, గోరు చిక్కుళ్లు, దోస తదితర కూరగాయలు గత నెలలో 30 నుంచి రూ.35 మధ్యలో ఉండగా తాజాగా రూ.50 నుంచి రూ.60 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. తీగ చిక్కుళ్లు గత నెలలో కేజీ రూ.80 కాగా ప్రస్తుతం రూ.100 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. కొత్తిమీర కట్ట రూ.20కి చేరింది. పుదీనా కట్ట రూ.20కు తక్కువ లేదని వ్యాపారులు చెబుతున్నారు. గోంగూర, తోటకూర, పాలకూర తదితర ఆకు కూరలు 3 కట్టలు గతంలో రూ.30 కాగా ప్రస్తుతం రూ.45కి చేరాయి. మరోవైపు రోజువారీ డిమాండ్ ఆధారంగా ధరలు హెచ్చు తగ్గులు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో పేద మధ్య తరగతి జీవన శైలి భారంగా మారింది. నిత్యావసర ధరల నియంత్రణ లేకపోవటంతో దళారులు రాజ్యమేలుతున్నారు. మరోవైపు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు రావటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం ధర కూడా అధికమే..

బియ్యం ధరలూ భగ్గుమంటున్నాయి. ప్రధానంగా సన్నరకాల బియ్యం ధరలు కిలో రూ.65కు చేరాయి. చిల్లర దుకాణాల్లో కిలోల లెక్కన తీసుకుంటే వీటి ధర మరింత పెరుగుతోంది. హోల్‌సేల్ మార్కెట్లో 26 కిలోల బస్తా రూ.1600 నుంచి రూ.1800కు చేరింది. ప్రస్తుతం వస్తున్న ధాన్యాన్ని ఆవిరి ద్వారా తేమశాతం తగ్గించి మర పట్టించి విక్రయిస్తున్నారు. పాత బియ్యానికి డిమాండ్ ఉండటంతో కొందరు ఆవిరితో మరపట్టించిన బియ్యాన్ని కలిపి విక్రయిస్తున్నారు. ఒకే రకమైన బియ్యాన్ని వివిధ బ్రాండ్ల పేరుతో ఆకర్షణీయమైన సంచుల్లో నింపి ధరలు పెంచి విక్రయిస్తున్నారు.

అంతా..కల్తీ మయం..!

కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా జిల్లాలో కారం నుంచి నెయ్యి వరకు అన్నీ కల్తీ మయంగా మారుతున్నాయి. తయారీదారులు వినియోగదారుల ఆరోగ్యాన్ని విస్మరించి కల్తీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యావసరాలు మొదలుకుని ప్రతి వస్తువులోకి కల్తీమయం చేస్తున్నారు. నూనె, నెయ్యి. శనగపిండి వంటి వాటితోపాటు చివరికి ధనియాలు, బఠాణీలు వంటి వాటిని కూడా వదలడంలేదు. గోధుమ పిండిలో మైదా, శనగపిండిలో బఠాణీ పిండి కలుపుతున్నారు. పచ్చికుసుమ గింజలు కలిసిన ఆవనూనెను వంటల్లో వాడుతున్నారు. నెయ్యిలో ఆవు ఎముకల నుంచి తీసిన తేటను కలుపుతున్నారు. బరువు కోసం బంగాళ దుంపలను నీళ్లతో ఉడికిస్తున్నారు. స్వచ్ఛమైన నెయ్యి చలికాలంలో గడ్డకడుతుంది. మార్కెట్‌లో లభించే నెయ్యిలో ఇటువంటి గుణం కనిపించడం లేదు. కందిపప్పులో శ్రీకాకుళంలో దొరికే కేసరి పప్పు అనే పదార్థాన్ని కలుపుతున్నారు. ఇది తినడం వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అరిశలు, ఇతర స్వీట్లు తయారు సమయంలో వాటి రంగు మరింత అకర్షణీయంగా కనబడటానికి మెటానిల్ అనే కెమికల్‌ను వాడుతుంటారు. ఇవి కలిసిన పదార్థాలను తినడం వల్ల జీర్ణవ్యవస్థ పూర్తిగా దెబ్బతిని క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. కల్తీల దెబ్బకు ఇంట్లో తయారు చేసుకునే పదార్థాల వల్ల అనారోగ్యం భారినపడే ప్రమాదం ఉంది. పండుగల సమయంలో కల్తీలు తీవ్రంగా జరుగుతున్నాయి. కల్తీలు ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నా. వ్యాపారులకు పట్టడంలేదు. పాలు, నెయ్యి, నూనెల కల్తీలతో క్యాన్సర్ తదితర తీవ్రమైన వ్యాధులు కూడా వస్తున్నాయి.

ప్రేక్షక పాత్ర లో అధికారులు

అధిక ధరలు, కల్తీపై ఆయా శాఖల అధికారులు తనఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికి వ్యాపారులు ఇచ్చే మాముళ్లు తీసుకుని చర్యలు చేపట్టకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నరన్న విమర్శలు వినపిస్తున్నాయి. ఇప్పటికైన అధికార యంత్రాగం మాముళ్ల మత్తులో నుంచి మేల్కొని తనిఖీలు నిర్వహించి అధిక ధరలకు కల్లెం వేయడంతో పాటు కల్తీని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

విద్యార్థులా.. పనిపిల్లలా..?

ప్రజాశక్తి గోరంట్ల



చెట్టు కొమ్మలు కొడుతున్న విద్యార్థులు

మండలంలోని పాలసముద్రం గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులను పనివారిగా మార్చారు. స్కూల్ భవనం పై నుండి చెట్టు కొమ్మలను కొడవలితో కొట్టిస్తూ విద్యార్థులతో పనులు చేయించారు తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యాభ్యాసం కోసం పాఠశాలకు పంపిస్తే స్కూల్లో ఇతర పనులను విద్యార్థులతో చేయించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. భవనం పైన గోడ అంచున కొడవలి పట్టుకొని చెట్టుకొమ్మలు కొట్టారు. ఈ సమయంలో విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

7న ఉపాధ్యాయులకు పురస్కారాలు : యుటిఎఫ్



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ఆత్మీయ ట్రస్ట్, యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల కార్యక్రమానికి సంబందించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ యుటిఎఫ్ 2025 సంవత్సర ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ సహకారంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వ విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న 66 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరికి సెప్టెంబర్ 7వ తేదీన ఆదివారం ధర్మవరం పట్టణంలోని ఎన్జీవో హోంలో నందు జరిగే కార్యక్రమంలో పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఈ .నారాయణ స్వామి, రవీంద్రనాథ్, ఎంకె. నబీ, ఉపేంద్ర మూర్తి, గంగాధర్ నరసింహులు, రాజ గోపాల్, రామాంజినేయులు , జె.నరేష్, గోవిందప్ప ఏ. ప్రభాకర్, మహేష్ గౌడ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవానికి సహకరించండి : ఎస్పీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పట్టణంలో నెలకొల్పిన వినాయక విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎస్పీ వి.రత్న సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి ఏర్పాటు చేసిన బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాల గురించి ఎస్పీ స్థానిక విలేకరులకు వివరించారు. గురువారం హిందూపురం పట్టణంలో ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ట్రాఫిక్ మళ్లించడం జరిగిందన్నారు. నిమజ్జనానికి వెయ్యి మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. నిమజ్జనం ప్రారంభమైనప్పటి నుండి ముగిసేంత వరకు డ్రోన్, సిసి కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగేలా అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రజలు, మతపెద్దలు, రాజకీయ పార్టీలు, యువత, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు జిల్లా పోలీసులకు సహకరించాలని కోరారు. హిందూపురం పట్టణంలో గురువారం జరిగే వినాయక విగ్రహాల శోభాయాత్ర ఊరేగింపు సందర్భంగా జిల్లా పోలీసుశాఖ పటిష్టమైన పోలీస్ భద్రతా చర్యలు చేపట్టిందని, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని తెలిపారు. అందుకోసం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. బందోబస్తు విధులలో అడిషనల్ ఎస్పీ 1, డిఎస్పీలు 5 మంది, సిఐలు 33 మంది, ఎస్సైలు 63 మంది, ఎఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు 170 మంది, పోలీసు కానిస్టేబుళ్లు 316, ఏపీఎస్పీ ప్లటూన్ లు 4, ఎఆర్ సెక్షన్లు, మహిళా పోలీసులు 49 మంది, హోంగార్డులు 210 మంది, స్పెషల్ పార్టీ పోలీసులు మొత్తం వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎవరికీ అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిమజ్జన ప్రక్రియ సంతోషంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ పట్టణ ప్రజలు, గణేష్ ఉత్సవ విగ్రహాల నిర్వాహకులకు సూచించారు.

ఏర్పాట్లు పరిశీలన : హిందూపురం పట్టణ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఆయా శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా పట్టణంలో గుంతలు పడిన రహదారులను తాత్కాలికంగా గుంతలు పూడ్చారు. అదే విధంగా భారీ వినాయక విగ్రహాల ఊరేగింపుకు అంతరాయం లేకుండా రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర లతో పాటు వివిధ శాఖల అధికారులు బుధవారం పరిశీలించారు. ప్రధానంగా విగ్రహాల నిమజ్జనం చేసే గుడ్డం కోనేరు వద్ద ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలు ఈ గణేష్ నిమజ్జనం తిలకించేందుకు అన్ని విధాలుగా అనుకూలమైన ఏర్పాట్లు చేశామని, గణేష్ శోభాయాత్ర జరుగు అన్ని ప్రాంతాల్లో గుంతలు పూడ్చడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ప్రెస్ వెంకటేష్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, కౌన్సిలర్ రాఘవేంద్ర, ఈర్షాద్ అహమ్మద్, టీడీపీ నాయకులు డైమండ్ బాబా, దుర్గా నవీన్, బేవినహళ్లి ఆనంద్ కుమార్, అన్వర్, తెలుగు మహిళ నాయకురాలు పరిమళ, వెంకటలక్ష్మి, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దస్తగిరి, డీఈఈ. వాణి, ఏఈ. జనార్దన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి : మంత్రి సవిత



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణం లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా టూరిజం అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. గొల్లపల్లి రిజర్వాయర్లో బోటింగ్, రెస్టారెంట్, అతిథిగృహం నిర్మాణం ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. పెనుకొండ కొండపై వెళ్లే రహదారి వద్ద టూరిజం రెస్టారెంట్ నిర్మాణం, శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాల పై టూరిజం అధికారులతో చర్చించారు. అనంతరం ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి పథకం పనుల పురోగతి గురించి చర్చించారు. నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటికి పథకం కింద పెండింగ్లో ఉన్న పనులు త్వరగా పూర్తిచేయాలని తాగునీటి సమస్య ఎక్కడ రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం పై జిల్లా విద్యాశాఖ అధికారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో 'కూటమి' విఫలం : వైసిపి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షులు ఉషశ్రీ చరణ్ విమర్శించారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ కమిటీ సమావేశం రాష్ట్ర కార్యదర్శి డి ఎస్ కేశవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉషశ్రీ చరణ్ తో పాటు హిందూపురం పార్లమెంట్ పార్టీ పరిశీలకు రమేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ. రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయడంలో ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవటంతో మామిడి రైతులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. నష్టపరిహారం పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే రైతు సమస్యలపై మండల, డివిజనల్ కేంద్రాలలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ కన్వీనర్ రవి నాయక్, రూరల్ కన్వీనర్ ఈశ్వరయ్య, అజయ్ అగ్రి కల్చర్ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీల రెడ్డి, జిల్లాలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

చలో విజయవాడను విజయవంతం చేయండి : ఎస్ఎఫ్ఐ



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి మడకశిర టౌన్

విద్యారంగం లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 6న తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్నిజయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్, జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు బుధశారం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. విద్యార్థుల ఫీజులు యాజమాన్యాల ఖాతాల్లోకి జమ చేస్తామని హామిఇచ్చి గత రెండు సంవత్సరాలుగా ఫీజురీయింబర్స్‌మెంట్ ఒక్క దఫా కూడా పూర్తిస్థాయిలో విడుదల చేయలేదని విమర్శించారు. ఫీజులు కడితేనే పరీక్షలు అనుమతి ఇస్తామని యాజమాన్యాలు తేల్చిచెప్పడంతో ఫీజులు చెల్లించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలౌతున్నారని అవేదన వ్యక్తంచేసారు. యువగళం పాదయాత్రలో నేటి విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 77 ను రద్దు చేసి పీజి ఎక్కడ చదువుకున్నా ఫీజులు చెల్లిస్తామని దీనిని అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు నోరు మెదపడంలేదని విమర్శించారు. వేలాది మంది విద్యార్థులకు పిజి చదువును కలగానే కూటమి ప్రభుత్వం మిగిల్చిందన్నారు. సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయని హాస్టళ్ళలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడంలేదని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను రూ.3వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. హాస్టళ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేసారు. యూనివర్శిటీలో ఖాళీగా ఉన్న విసి, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న విద్యార్థులందరికి ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. పాఠశాల, జూనియర్ కళాశాలల్లో విద్యార్థి సంఘాలకు ప్రవేశాన్ని నిషేదిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. తమ డిమాండ్లను పలుమార్లు విన్నవించినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని అందుచేతనే ఈ నెల 6న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి లోకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ముదాహిర్, మహీంద్రా, గణేష్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - బత్తలపల్లి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని సంగాల గ్రామంలో గత రెండు రోజులుగా' పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దోమలు ఉత్పత్తి పెరిగి జ్వరాలు సోకుతున్నట్లు వివరించారు. ఇందుకుగాను ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల ఉత్పత్తి పెరగకుండా మురుగునీరు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. అనంతరం జ్వరాల సర్వే. లార్వా సర్వే చేసి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 9 మందికి చిరు వ్యాధులకు చికిత్సలు అందించారు. జ్వరాల నియంత్రణకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సచివాలయ సెక్రటరీ సహకారంతో దోమల నియంత్రణకు మిలాథిన్ మందును స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సిహెచ్ఓ రాజశేటర్, సూపర్వైజర్లు ఆశ్వర్ధనారాయణ, గౌరమ్మ, సచివాలయ సెక్రటరీ మహమ్మద్ హాజిత్, ఆరోగ్య కార్యకర్తలు డేవిడ్, మారుతి, రత్నమ్మ, హెల్త్ ప్రొవైడర్ లిఖిత, ఆశా సరస్వతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

గుమ్మనూరు జయరాంపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ


ధర్మవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు


పుట్టపర్తిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు పట్ల అనుచితంగా వ్యవహరించిన గుంతకల్లు ఎమ్మెల్యే జయరాంపై ప్రభుత్వం వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ధర్మవరం పట్టణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామకృష్ణతో పాటు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న తదితరులు మాట్లాడారు. గుత్తి పామిడి మండలంలోని ఐదు గ్రామాలలో సోలార్ విండ్ పవర్ ప్లాంట్లను రెన్యు విక్రమ్ అనే సంస్థ ఏర్పాటు కోసం లీజు పద్ధతిలో దళారుల చేత అధికార పార్టీ నేతలు బెదిరింపులతో భూసేకరణ సాగుతుందని ఆరోపణలు వచ్చిన సందర్భంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, మండల నాయకులు రైతులు పర్యటనకు వెళ్లారన్నారు. ఆ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఫోన్‌లో రైతు సంఘం నాయకులను అవమానపరుస్తూ రైతులను కార్మికులను బెదిరిస్తూ మాట్లాడటం సరికాదన్నారు. ఇలాంటి ప్రజాప్రతినిధిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్ బాషా, సిఐటియు నాయకులు జెవి రమణ, అయుబ్ ఖాన్, ఎల్. ఆదినారాయణ, ఎస్. హైదర్ వలి, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆలకుంట మారుతి, వెంకటస్వామి, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: సిపిఎం నాయకుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇయస్ వెంకటేష్ , లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గుత్తి మండలం బేతేపల్లిలో సోలార్ కోసం భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడటానికి వచ్చిన నాయకులపై గుంతకల్లు ఎమ్మెల్యే ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి కి ఎమ్మెల్యే జయరాం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం జయరాంను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కూటమిపాలనలో అవినీతి లేదని గొప్పలు చెప్పుకునే సీఎం ,డిప్యూటీ సీఎం స్పందించాలన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా ఇలాంటి వారిని వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి,కొత్తచెరువు మండల కార్యదర్శి అంకే ముత్యాలు, పై పల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : సోలార్ విండ్ పవర్ ప్లాంట్ భూనిర్వాసితులతో మాట్లాడటానికి వెళ్ళిన్నరైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డిపై అనుచితంగా ప్రవర్తించిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నాయకులు రామకృష్ణ, వెంకటస్వామి, నాగిరెడ్డి, బాబయ్య, మురాషా, మౌలాలి తదితరులు మాట్లాడుతూ ఇలా బెదిరింపు విధానాలు సరికాదని అన్నారు. సిపిఎం నాయకుల పట్ల గుమ్మనూరు జయరాం నోరు పారేసుకున్న వైనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అలాగే ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఆదర్శవతంగా ఉండాలని ప్రజలు అసహ్యించుకునే రీతిలో నాయకులు మాట్లాడుతూ తమ స్థాయిని మరిచి దిగజారి పోతే ప్రజలు గుర్తించుకొని తగిన విధంగా బుద్ధి చెబుతారని అన్నారు.

నంబులపూలకుంట : ఏపీ రైతు సంఘం నాయకుడు ప్రభాకర్‌రెడ్డి పై గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయ రాములు దుర్భాషలాడటం సమాజం ప్రజా సంఘాల నాయకులు నాగిరెడ్డి గంగిరెడ్డి నాగరాజ్ సోమిరెడ్డి తదితరులు అన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

గాండ్లపెంట : సిపిఎం నాయకుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై చర్యలు తీసుకోవాలని నాయకులు కేకే రాజారెడ్డి, ఖాదర్‌బాషా, హమాలి కొండయ్య తదితరులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాములు వెంటనే క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

కదిరి టౌన్ : రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి పట్ల గుమ్మనూరు జయరాం బెదిరింపు వైఖరి సబబు కాదని సిఐటియు నాయకులు జిఎల్ నరసింహులు అన్నారు. ఈసందర్భంగ ఆయన మాట్లాడుతూ గుంతకల్లు ఎమ్మెల్యే వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు. ఇలాంటి బెదిరింపులకు ప్రజా సంఘాలు భయపడవన్నారు. మళ్లీ ఇలాంటివి పునరావతమైతే పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సాంబశివ, బాబ్ జాన్, జగన్మోహన్, రైతు సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి, శంకర్ రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవర్తించిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లడతూ బాధ్యతగల ఎమ్మెల్యేగా ఆయన మాట్లాడిన పదాలు సరైనవి కాదన్నారు. ఇలాంటి బెదిరింపులకు ప్రజా సంఘాలు భయపడవన్నారు. మళ్లీ ఇలాంటివి పునరావతమైతే పోరాటం తప్పదని రైతు సంఘం జిల్లా కమిటీ మెంబర్ ఎం శివన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వివి రమణ, ఎస్వి రమణ, సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు ఒంటెద్దు వేమన్న, నరసింహారెడ్డి, నాగేంద్ర తదితరులు హెచ్చరించారు.


పాఠశాల తనిఖీలో ఎంఇఒ, తదితరులు

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని దొడగట్ట ప్రభుత్వ హైస్కూల్‌ను ఎంఇఒ జయభాస్కర్ బుధవారం పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ నిర్వాహకులు మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని తెలిపారు. నాణ్యతలో ఎలాంటి రాజీలేదన్నారు. భోజనం, విద్యా విధానంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరిధర్, సరస్వతమ్మ, వెంకటస్వామి, లక్ష్మీదేవి,నాగార్జున,సాయిలక్ష్మి, నరసింహులు, పరమేష్, రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు ఇద్దరు ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు సత్యసాయి జిల్లా నుండి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్టు. డీఈవో కిష్టప్ప తెలిపారు. కొత్తచెరువు మండలంలోని బండ్లపల్లి జడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మాణిక్యం ఇస్సా, రొద్దం మండలం కోగిర పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జయచంద్ర రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారని చెప్పారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం ఏడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వార్షిక్ ప్రీమియం కేవలం రూ 20ల కే రెండు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని ఎడిసిసి బ్యాంక్ మేనేజర్ చలం పేర్కొన్నారు. వీటితోపాటు ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం రూ 436లకే రెండు లక్షల జీవిత బీమా లభిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు తుమ్మల మహబూబ్ బాషా, బోయపల్లి శివారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ బ్రహ్మచారి, సీఈవో రామ్మోహన, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోని కొత్తపల్లిలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ షబ్బీర్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక తహశీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం షబ్బీర్ మాట్లాడుతూ విగ్రహాలు పెట్టడానికి అనువైన స్థలం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, నూర్ సాహెబ్, దాదా పీర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని కోరేవాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు నీలం అశోక్ రాధా, కిషోర్‌ను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ గోపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, కృష్ణవేణి, నాగరాజు, నరేందర్ రెడ్డి, రజిత, షబానా బేగం, సుమతి, సుభాష్ నాయక్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - తనకల్లు

అప్పుల బాధతో మృతిచెందిన మండలపరిధిలోని ముల్లోళ్ళ పల్లికి చెందిన టీడీపీ కార్యకర్త భీమన్న,(48) కుటుంబాన్ని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం పరామర్శించారు. ఈసందర్భంగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పరిచయ సభ

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ రచించిన భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తక పరిచయ సభ బుధవారం ఘనంగా జరిగింది. జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి డాక్టర్ హరి ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా ముస్లిం లెజెండ్స్ పుస్తక రచయిత కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ పుస్తకాన్ని పరిచయం చేశారు. భారత దేశ నిర్మాణం కోసం ముస్లింలు, దేశ స్వాతంత్ర్య ఉద్యమం లో ఎనిమిది లక్షల ముస్లింలు అసువులు బాసారని ఇక్కడే పుట్టి ఇదే మట్టిలో కలిసి పోయారని చెప్పారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకానికి రాయలసీమ సాహితీ రత్నం పురస్కారం 2025 ను ప్రముఖులు కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.హెచ్.పి.ఎస్. వ్యవస్థాపక అధ్యక్షులు హనుమంతు, డాక్టర్ మంజుల, ఎంపీడీవో నాగభూషణం, న్యాయవాది హేమాద్రి, డాక్టర్ విజయలక్ష్మి, సుధాకర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ప్రభాకర్, స్వామిదాస్, వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా, కార్మిక శాఖ అధికారి శివప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

'పాంచజన్య'లో ఓనం వేడుకలు

ప్రజాశక్తి - హిందూపురం


ఓనం వేడుకల్లో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది

పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో బుధవారం ఓనం పండుగ వేడుకలు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, కరస్పాండెంట్ డి.ఎస్ నందకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. విద్యార్థులు కేరళ సాంప్రదాయ దుస్తులను ధరించి ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు పి శ్రీనివాసులు మాట్లాడుతూ భారతదేశం అనేక సంస్కృతి, సాంప్రదాయాలకు పుట్టినిల్లు అని అన్నారు. కేరళ రాష్ట్ర ప్రజల తొలి పండుగ ఓనం అన్నారు. 1961 లో ఈ పండుగకు జాతీయ గుర్తింపు లభించిందని, విద్యార్థి దశలోనే మన దేశంలో జరిగే పండుగలపై అవగాహన కలిగి ఉండి పరమత సహనాన్ని పాటించి జాతీయ సమైక్యతతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, పరిపాలనాధికారి భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, సహ ప్రధాన ఉపాధ్యాయులు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - కొత్తచెరువు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సహకార సంఘాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. మండల పరిధిలోనే కేసాపురం సహకార సంఘం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తోందన్నారు. నాబార్డ్ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. రైతులకు వీటి ద్వారా మందులు ఎరువులను రుణాలను అందించాలన్నారు. అనంతరం ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన రైతు సత్యనారాయణ భార్య ప్రతిభకు కేసాపురం సహకార బ్యాంకు ద్వారా మంజూరైన రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు, బాబయ్య, పాలకమండలి సభ్యులు, జనసేన పార్టీ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణ, వలిపి శ్రీనివాసులు, సింగల్ విండ్ అధ్యక్షులు హరిప్రసాద్, నాయకులు లక్ష్మీనారాయణ, గోపాల్ రెడ్డి, శంకరప్ప, వెంకట్రాముడు, శ్రీరాములు, రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని బూచేపలికి చెందిన శివశంకర్ (38) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ సమీపన పొలాల్లో చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివశంకర్ మృతికి కారణాలు తమ దర్యాప్తులో తేలాల్సుందని పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని ఒక హోటల్‌లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. తమకు వచ్చిన సమాచారం మేరకు సిఎస్‌డిటి వెంకటరెడ్డి, ఆర్ఐ ఆశోక్, రెవెన్యూ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. 169 కేజీల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి ఎంఎల్ఎస్ గోడౌన్‌లో స్వాధీనం చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని గోనిమేకలపలికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త క్రిష్టప్ప(56) అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కర్నూల్ ఆసుపత్రిలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత బుధవారం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు 10వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ నరహరి, నాయకులు మాధవ నాయుడు, వెంకటరామిరెడ్డి, అశ్వర్థనారాయణ, చిన్నప్పయ్య, వేణుగోపాల్, టైలర్ ఆంజనేయులు, గంగాధర్, రామచంద్ర, సిద్దన్న, ఉమాశంకర్, జయప్ప, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బికె జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

హిందూపురం ఎంపీ పార్థసారధి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని సగర ఉప్పర కులస్తులు బుధవారం నిర్వహించారు. మండల సగర ఉప్పర అధ్యక్ష ఉపాధ్యక్షులు రామచంద్ర, బోర్ గోపాల్ ఆధ్వర్యంలో స్థానిక సగర ఉప్పర కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రొద్దం నరసింహులు, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్థసారథి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సగర ఉప్పల కులస్తులకు కళ్యాణ మండపానికి స్థలాన్ని కేటాయించడంతోపాటు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. అనంతరం అభిమానుల మధ్య కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పందిపర్తి భాను, అశ్వత్తా, నాగమణి, గాయత్రి, గోపాల్, లక్ష్మన్న, కుమార్, ఈశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, మైలర్, శేఖర్, నరసింహప్ప, మేస్త్రి అక్రమ్ భాష, ఉప్పర సగర సామాజికవర్గం వారు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : హిందూపురం ఎంపీ పార్థసారథి 66వ జన్మదిన వేడుకలు బుధవారం మండలంలోని అయన రైస్ మిల్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు, సుబ్బరత్నమ్మ, లీలమ్మ, తులసి, నాగేంద్ర, రొద్దకంపల్లి నాగరాజు, రాజేష్, దొడగట్ట రామాంజి తదితరులు పాల్గొన్నారు.

అగళి : మండల కేంద్రంలో జడ్పిటిసి ఉమేష్, మాజీ మండల కన్వీనర్ రవికుమార్ ఆధ్వర్యంలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. టిడిపి నాయకులు కార్యకర్తలు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొని కేక్ కట్ చేశారు

అన్న పేరు మీద ఉన్న భూమి తమ్ముని పేరుపై రిజిస్ట్రేషన్



తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న బాధితుడు

ప్రజాశక్తి - బుక్కపట్నం

కెవైసి పేరుతో తన పేరు మీద ఉన్న భూమిని తన తమ్ముడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని కొత్తచెరువు మండలం ఇరగంపల్లి పంచాయతీ వంగంపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకట్ రాముడు వాపోయాడు. ఈసందర్భంగా బాధిత రైతు తనకు జరిగిన అన్యాయాన్ని బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో వివరించారు. తనకు పింఛను రాలేదని కెవైసి చేయిస్తానని తన తమ్ముడు అంకె శ్రీరాములు తనను మోసం చేసి తన పేరు మీద 1. 19 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. ఇరగంపల్లి పంచాయతీలోని వంగంపల్లి గ్రామంలో సర్వే నంబర్ 50 /1 నందు 1-19 సెంట్ల భూమి 23వ తేదీన బుక్కపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయానికి తీసుకువచ్చి శ్రీరాములు పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వాపోయాడు. చదువురానితనని మోసం చేసి కోర్టులో ఉన్న ఐదు ఎకరాలలో భూమి రిజిస్ట్రేషన్ చేస్తున్నానని చెప్పి తన పేరు మీద ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లి తనిఖీ చేసుకోగా తమ్ముని నిలదీస్తే మొదట డబ్బులు ఇచ్చినానని చెప్పి, తర్వాత మోసం చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. బుధవారం తిరిగి అన్న పేరు మీద రిజిస్ట్రేషన్ చేయిస్తానని ఒప్పుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి బ్యాల అంజి బాధితులతో మాట్లాడారు. అండగా నిలిచి పోరాటం చేస్తామని చెప్పారు.

న్యాయం చేయాలని బాధితుడి విన్నపం

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - హిందూపురం

ప్రభుత్వం నుండి మంజూరైన సీఎం సహాయ నిధి ఆర్థిక సహాయాన్ని బుధవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. లేపాక్షి మండలం కొండూరు పంచాయతీ శ్రీరాములు, శ్రీనివాసులు అనే లబ్ధిదారులకు నాయకుల సమక్షంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, లేపాక్షి మండల కన్వీనర్ అభిలాష్, లేపాక్షి మండల సమన్వయకర్త ఈ.జయప్ప, కొండూరు సర్పంచి సిద్దార్థ్, మాజీ ఎంపీపీ ఆనంద్, మాజీ ఎంపీటీసీలు అశ్వర్థప్ప, నాగరాజు, సిద్దలింగప్ప, మాజీ సర్పంచి శివప్ప, తిరుమలేష్, తిమ్మగానిపల్లి నరసప్ప, మల్లికార్జున, వెంకటష్, అనిల్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండల పరిధిలోని డబురువారిపల్లి పంచాయతీ కుసుమవారిపల్లి గ్రామంలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల అధ్యక్షులు సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒకు బుధవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో డ్రయినేజీ అధ్వానంగా మారిందన్నారు. మురుగుకాలువలు పూడుకుపోయాయన్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే గ్రామస్తులు అనారోగ్యం పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకరప్ప, మున్నా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కియా ఆధ్వర్యంలో సోలార్ వీధి దీపాలు ఏర్పాటు


గ్రామస్తులతో కియా ప్రతినిధులు, తదితరులు

ప్రజాశక్తి-పెనుకొండ

కియా ఇండియా వారి సోషల్ కాంట్రిబ్యూషన్స్ ద్వారా 1000 సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్దాంగ్ లీ తెలిపారు. బుధవారం పెనుకొండ మండలం వెంకటాపురం తండాలో రెండో దశ సోలార్ వీధి దీపాల ఏర్పాటును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, సమాజ సంక్షేమం పట్ల కియాకు ఉన్న నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు పెనుకొండ ప్రాంతంలో లక్ష మందికి పైగా ప్రజలకు లాభం చేకూరనుందని చెప్పారు. ఫేజ్-1లో కియా ఇండియా పెనుకొండ మండలంలో 250 సౌర వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థిరమైన జీవనోపాధులపై దృష్టి సారిస్తూ, కియా ఇండియా రొద్దం మండలంలో పండ్ల చెట్ల నాటింపు కార్యక్రమం (ద్వితీయదశ) ను ప్రారంభించిందని 600 మంది రైతులు సుమారు 40వేల పండ్ల మొక్కలు అందించామని అన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గత సంవత్సరం, ఫేజ్-1లో పెనుకొండ, సి.కె.పల్లి కి చెందిన 554 మంది రైతులకు 40వేల పండ్ల మొక్కలు పంపిణీ చేశామన్నారు. మట్టిని పరీక్షించి ఆయా ప్రాంతాలకు అనుకూలమైన మొక్కలను ఎంపిక చేసి రైతులకు ఇస్తామన్నారు. రైతులు మొక్కలను సరైన రీతిలో సంరక్షించేందుకు, ప్రత్యేకంగా నిపుణులను నియమించి 'ప్లాంట్ కేర్ అడ్వైజరీ సేవలు' అందిస్తోందని ఆయన వివరించారు.

5న అంగన్వాడీ యూనియన్ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తిలో నిర్వహించే అంగన్వాడి వర్కర్స్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా యూనియన్ నాయకులు తెలిపారు. పుట్టపర్తిలోని సాయి ఆరాం లో ఈనెల 5న జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభలకు ముఖ్య అతిథులుగా అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్, సత్యసాయి జిల్లా అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొననున్నారని చెప్పారు. ఈ మహాసభలో అంగన్వాడీ వర్కర్ల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు రూపొందించి వాటిపై రాబోవు రెండు సంవత్సరాల పాటు సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని చెప్పారు.

ఎస్సీ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని వెలదడకల పంచాయతీ పత్తికుంటపల్లి ఎస్సీ కాలనీలో విద్యుత్ సరఫరాకు నిత్యం అంతరాయం ఏర్పడుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌నుంచి సరఫరా విషయంలో రోజుకు ఐదు ఆరు సార్లు బ్రేక్ డౌన్ అవుతోందని చెప్పారు. ప్రతిసారి విద్యుత్ అధికారులు అందుబాటులో లేకపోవడంతో కాలనీవాసులే వెళ్లి బ్రేకప్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈ సమస్యతో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం జరుగుతుందని ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ అంతరాయ సమస్యను పరిష్కరించాలని పత్తికుంటపల్లి ఎస్సీ కాలనీ వాసలు కోరుకుంటున్నారు

బాధ్యతలు స్వీకరణ

రొద్దం : సింగిల్ విండో అధ్యక్షులు గా రొద్దం గ్రామానికి చెందిన నిరుగంటి వీరాంజి నేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.అదే విదంగా అందులో పలువురు సభ్యులు కూడా ఆయనతో పాటు బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా వీరాంజినేయులుకు సొసైటీ సిబ్బంది, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు.

కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి - మడకశిర టౌన్

పట్టణంలోని కొళాయి అక్రమ కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగన్నాథం కోరారు. సచివాలయ, మున్సిపల్ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి అని ప్రతి ఇంటి ముందు ఉన్న నీటి కుళాయి తొలగించి ప్రతి 30 గృహాలకు ఒక వీధి నీటి కుళాయి ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ కుళాయి కనెక్షన్లు క్రమబద్ధీకరించుకొని మున్సిపల్ ఆర్థిక పరిస్థితికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - పరిగి


సన్మాన కార్యక్రమంలో నాయకులు

స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్‌గా నియామకమైన రెడ్డివారి మంజునాథ్‌ను స్థానిక నాయకులు బుధవారం సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాయకులు కార్యకర్తల కోసం పనిచేసిన రెడ్డివారి మంజునాథ్‌ను అధిష్టానం గుర్తించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవింద్ రెడ్డి, వెంకటేష్, నాగభూషణం, డిఎస్ఎల్ శ్రీనివాసులు, కంకర శ్రీనివాసులు, బలరాం, బోరెడ్డిపల్లి మహేష్, రమేష్, ఆదిమూర్తి, గంగాధర్, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.